# వైఢూర్యం

- జ్యోతిష్యరత్న డా॥వేణుగోపాల్ రావు వీరమనేని

వైఢూర్యాన్ని పిల్లికన్నురాయి అని, కేతు ప్రియమని, ఏకమాత్రమని, ఖరాబ్జాంకురమని అంటారు. వైఢూర్యం నవరత్నాలలో తొమ్మిదవది. ముఖ్యమైనది, ఈ రత్నం కేతువు ఛాయాగ్రహానికి అత్యంత ప్రీతికరమైనది. ఇక గ్రహవర్ణములు తీసుకుంటే రాహువు చండాలుడనీ, కేతువు మ్లేచ్ఛుడని కొందరంటారు. రాహువు తమోగుణము కలవాడతై కేతువు సత్వగుణం కలవాడు. రాహు, కేతువులు నపుంసక గ్రహాలు కూడా! కొందరు వీటిని స్త్రీగ్రహములంటారు. కేతువు చిత్రమైన వర్ణము కలవాడు. కేతువు 'మోక్ష' కారకత్వం కలవాడు. రాహు, కేతువులు ఒక్కొక్క రాశిలో సంవత్సరం ఆరు నెలలు ఉందురు. గ్రద్దవాహనం కలవాడు కేతువు. ఇతడికి వృశ్చికం స్వక్షేత్రం. కుంభం మూలత్రికోణం. వృశ్చికం పరమోచ్ఛ అయితే వృషభం పరమనీచ. మంత్ర తంత్రములు చేయువాడు. దైవభక్తి, మంత్ర తంత్ర శక్తి, మోక్షం, వేదాంతం, వైద్యం, ఆధ్యాత్మికచింతన, వ్రణములు, చర్మవ్యాధులు, తక్కువ మాట్లాడుట, బ్రహ్మచర్యం, సన్యాసం, పిశాచబాధ, చపలస్వభావం, శతృభయం, కంటి వ్యాధులు మొదలగునవి కేతువు కారకత్వములు. రాహుకేతువులు కేంద్రస్థానముల యందుగాని, త్రికోణస్థానంలందుగాని యున్నప్పుడు కేంద్రమందున్నప్పుడు త్రికోణాధిపతి సంబంధం, త్రికోణమందున్నప్పుడు కేంద్రాధిపతి సంబంధం ఉన్న యెడల అట్టి రాహుకేతువులు రాజయోగమునిత్తురు. కేతుదశ మహాదశ 7 సంవత్సరములలో మొదటి భాగం దు:ఖం, మధ్యమందు భయం, అంత్యమున రాజాగ్రహం, శరీర సౌఖ్యం సంబవింతును.

కేతు మహాదశలో కేతువు శుభగ్రహముచే వీక్షింపబడుటచే జాతకునికి సౌఖ్యం, ప్రభుత్వోద్యోగం, తద్వారా ధనవృద్ధి, గృహనిర్మాణం, భక్తి మొదలగునవి సంభవించును.

కేతుమహాదశలో కేతువు పాపగ్రహముచే వీక్షింపబడుటచే జాతకునికి దు:ఖం, జ్వరం, చర్మవ్యాధులు, అధికారుల ద్వారా కష్టములు, ధననాశనము, రోగం కష్టములు. బంధువులతో తగవులు, అజ్ఞాత జీవనము, ప్రమోషన్లు లేకపోవుట కలుగును. కేతువు లాభస్థానంలో ఉన్నను, వ్యయంలో ఉన్నను యోగించును. చంద్రునితో కలిపియున్న యోగమును, ఆయుర్దాయమునునిత్తురు. కేతువు శనితో కలిపి ఉన్న లేదా శనితో శుభస్థానములలో యున్నను యోగించును. కేతు, బుధులు కలిపి శుభస్థానములైన కేంద్రకోణములలో యున్న ఆ దశలు యోగించును. సప్తమంలో కేతువు మంచిదికాదు. భార్యను తృప్తిపరచలేడు. ఈ విధంగా రాహుకేతువులు జ్యోతిష్యశాస్త్రంలో ఒక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. రాహుకేతువుల గురించి ముందుముందు తెలుసుకుందాం. గ్రహశాంతులలో కేతువుకు వైఢూర్యం చెప్పబడింది.

వైఢూర్యము ఈజిప్టు దేశములో అనేక మంది చక్రవర్తులు దీనిని ధరించినట్లు చరిత్ర చెబుతోంది. కాల్షియం, సోడియం, అల్యూమినియం అనే రసాయనసమ్మేళనం వైఢూర్యం. ఇవి ఈజిప్టు, శ్రీలంక, ఇండియా, బర్మా, ఆఫ్రికా, ఘణా, చైనా దేశాలలో లభిస్తాయి.

ఇది పల్లికన్నువలె మెరుస్తూ వుంటుందని దీనిని పిల్లికన్ను రాయి (క్యాట్స్ ఐ) అంటారు. ఈ రత్నానికి మధ్యలో దారమువలె సన్నని సూత్రముంటుంది. ఇట్టిది ప్రశస్తమైనది. కొన్ని నీలిరంగులోగాని, ఎరుపు ఛాయలోగాని కన్పించును. నీలిరంగు గలవి కృష్ణ వైఢూర్యములు. కొన్ని గచ్ఛకాయరంగులో ఉంటాయి. వైఢూర్యము తెలుపు, నలుపు కలిసి ఉంటే దానిని బ్రాహ్మణజాతికి చెందినదిగా, తెలుపురంగుతో ఎరుపు కలిసి ఉంటే క్షత్రియజాతికి చెందినదిగా, పసుపు నలుపు మిళితమై ఉంటే వైశ్యజాతికి చెందినదిగా, ఏరంగులు మిళితమైనప్పటికి నలుపు ఎక్కువ మోతాదులో కన్పించుచుండిన శూద్రజాతికి చెందినదిగా విభజించిరి.

ఇవి సుతారము, ధనము, అత్యచ్ఛం, కలిలము, వ్యంగ్యము అనే ఐదు రకాలుగా లభిస్తాయి. నెమలికంఠం రంగు, వెదురు ఆకు రంగు, పద్మమువంటి రంగు కలది శ్రేష్ఠమైనది. ఉత్తమమైనది. ఇట్టిది ధరించిన సంపదలు కలుగును. చిన్నదిగా ఉండి బరువు కలది ధనము. ఎటువంటి దోషాలు లేకుండా ఆకర్షణీయంగా ఉండేది అత్యచ్ఛము. ఎక్కువ కాంతివంతంగా కన్పించేది కలిలము. లోపల ప్రతిబింబం కన్పించేది వ్యంగ్యము.

దేహము, త్రాసము, కర్కరము, కర్కశము, కలంకము అని వైఢూర్యం లోపల మలినము, కాంతిహీనముగా ఉండుట, చిన్నచిన్న రాళ్ళతో కూడినట్లుండుట, తేలికగా ఉండుట, పగుళ్లు, కఠినంగా ఉండుట, గీతలు, బ్రద్దలు అయినట్లుండుట, గరకుగా ఉండుట, నల్లగా ఉండుట ఇందులో దోషములు. వీటిని ధరింపరాదు.

గర్భిణీ స్త్రీలు దీనిని ధరించిన సుఖప్రసవము కలుగును, ప్రసవానికి ముందు వైఢూర్యాన్ని నీటిలోగాని, నేతిలోగాని కొంచెం సేపు ఉంచి పిదప వాటిని సేవించిన సుఖప్రసవము కలుగుతుందట. స్త్రీలు ధరించిన ఆయువు వృద్ధి, ఐశ్వర్యములు కలుగును.

జన్మ నక్షత్రము అశ్విని, సుఖ, మూల అయినవారు, కేతు మహాదశలో కష్టనష్టములు బాదలు కలుగుచున్నవారు, 7.15,25 తేదీలలో జన్మించినవారు వైఢూర్యమును ధరింపవలెను. ఈవిధంగా ధరించినవారికి భూత, ప్రేత, పిశాచాదుల బాధలు తొలగును. ఇతరులు ప్రయోగించిన మంత్ర తంత్రములు పనిచేయవు. శత్రువులు నశింతురు. ముక్తి, భక్తి, జ్ఞానసంపద, ఆధ్యాత్మిక చింతన కలుగచేసి ప్రశాంత చిత్తము నొసగును. నీటిగండముల నుండి కాపాడును. మంత్రసిద్ది కలుగును. సమాజంలో పేరు ప్రతిష్టలు కలుగును. విషజంతువులు కరచిన విషం హరించును. కోర్టు కేసుల్లో విజయము కలుగును. కేన్సర్, హెమరేజ్, గుండెవ్యాధులు, కీళ్ళ నొప్పులు తొలగును.

నెమలికంఠం రంగుకలది, వెదురు ఆకు రంగు కలది. పద్మం రంగు వంటిది. మూడు గీతలు కలది ధరించిన బహుశుభ ఫలితములు కలుగును. సైనికులు దీనిని ధరిస్తే యుద్దంలో విజయం సిద్దిస్తుంది.

వైఢూర్య పూజా విధానం : బుదవారం ఉదయం 6గం॥ నుండి 7గం॥లు లేక మద్యాహన్నం 1గం॥ నుండి 2గం॥ ల మద్య లేక రాత్రి 8-9 గం॥ల మధ్యలో పూజ చేయవలయును.

పూజా సామగ్రి : 1. నాగు పాము ప్రతిమ (వెండిది) 2. ఇత్తడి ప్లేటు 3. బూడిద వర్ణము లేక అనేక వర్ణంలు కలిగిన వస్త్రం. 4. ఉలువలు 5. గంధం 6. కుంకుమ 7. పెరుగు (పసాదంగ పంచడానికి) 8. ఒక చిన్న గిన్నెలో పంచదార.

పూజా విధానము : నాగ ప్రతిమను పూజ గదిలో ఉంచి దానియందు కంచు లేక ఇత్తడి ప్లేటును ఉంచి దానిపై వస్త్రం, వస్త్రంపైన ఉలువలు పోయవలయును.

వైఢూర్యపు ఉంగరం లేక లాకెట్‌ను గందం మరియు కుంకుమలతో అలంకరించి ఉలువల పైన ఉంచవలయును.

కేతు మంత్రం ను 108 పర్యాయాలు పటిస్తూ పుష్పాలతో గాని ఉలువలతో గాని పూజను నిర్వంచాలి. ఉంగరం దరించిన తదుపరి ప్రసాదం పంచి పెట్టాలి.

కేతుమంత్రం : అశ్వధ్వజాయి విద్మహే
శూల హస్తాయ ధీమహీ
తన్నో కేతు ప్రచోదయాత్